క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 30, వంకాయ 35, బెండ 35, పచ్చి మిర్చి 50, కాకర 38, బీర 40, క్యాబేజి 13, ఫ్రెంచిబీన్స్ 55–90, క్యారెట్ 38, దొండ 23–28, చిక్కుడు 55, గోకర 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 70, ఆలు 20, దోస 15, సొర 15, పొట్ల 18, ఉల్లి 14, చామగడ్డ రూ. 35 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేటి నుంచి దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయ అష్టాదశ వార్షికోత్సవాలను శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు దుర్గాదేవికి పంచామృత ఫలరస అష్టోత్తర కలశాలతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 9 గంటలకు గణాధిపతి పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠ స్థాపిత దేవతా హవనం, ఆదివారం ఉదయం 11 గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చన, 12 గంటలకు అమ్మవారి శేషవస్త్రాల వేలం జరుగుతుందని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై ప్రశ్నిస్తే ఉలుకెందుకు?

మన్సూరాబాద్: మన్సూరాబాద్ సర్వే నెంబర్ 72లోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి, చెరువు శిఖం స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ప్రశ్నిస్తే, బీఆర్‌ఎస్ నేతలు ఎదురుదాడులకు పాల్పడుతుండటం సిగ్గుచేటని బీజేపీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్ ధ్వజమెత్తారు. మన్సూరాబాద్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చిన్నచెరువు కబ్జా అవుతుందని అన్ని ఆధారాలతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కమిషనర్ కబ్జా వైనంపై సర్వే చేసి రిపోర్టు అందజేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారని తెలిపారు. వీరన్నగుట్టలోని ప్రభుత్వ స్థలాన్ని గులాబీ నాయకులు కబ్జా చేస్తున్నారని, విచారణ చేపట్టాలని హయత్‌నగర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీజేపీ మన్సూరాబాద్ మాజీ అధ్యక్షుడు కడారి యాదగిరియాదవ్, ప్రధాన కార్యదర్శి పిన్నింటి కొండల్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పోరెడ్డి కవిత, నాయకులు ఎంజాల జగన్, పాతూరి శ్రీధర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, రమేష్‌చారి, రామస్వామి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం

హస్తినాపురం: మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లకు తోడు ఉరుకుల పరుగుల జీవితం .. నిత్యం పని ఒత్తిడి వల్ల చిన్నాపెద్దా తేడాలేకుండా మానసిక వేదనకు గురవుతున్నారని ప్రతి ఒక్కరూ యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని యోగా గురువు ఇస్మాయిల్ గురూజీ అన్నారు. హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రీ షిరిడీ సాయి అష్టాంగ యోగా శిక్షణా తరగతుల బ్రోచర్‌ను గురువారం ఆయన కడారి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ గురూజీ మాట్లాడుతూ... ఈ నెల 4 నుంచి రోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు యోగా శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, సరిత, ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఉపేందర్, నరేందర్, కవిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో బిర్యానీ విందు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్యారడైజ్ ఫుడ్ కోర్ట్ ఆధ్వర్యంలో అనాథ చిన్నారులకు రుచికరమైన విందును అందించారు. ఎల్‌బీ నగర్ ప్రాంతంలోని 'అనాథ విద్యార్థి గృహ' అనాథాశ్రమంలో పిల్లల కోసం గురువారం బిర్యానీ, సైడ్ డిష్‌లు, డిజర్ట్స్ తదితర వంటకాలతో చక్కని విందును వడ్డించారు. ఈ సందర్భంగా సంస్థ వైస్ ప్రెసిడెంట్ కుశాగ్ర గుప్తా మాట్లాడుతూ... ప్రతి చిన్నారికీ పోషకాహారం అందించాల్సి ఉందని, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

ఓటర్ల పరిశీలనకు బీఎల్‌ఓలు!

- ముమ్మరంగా బోగస్ ఓట్ల ఏరివేత
- ఇంటింటికీ వెళ్తూ పరిశీలిస్తున్న వైనం
- ఆధార్ అనుసంధానం కూడా..
- ఈ నెల 23 వరకు సర్వే
- అక్టోబర్ 4న తుది జాబితా



ఓటరు వివరాలు తెలుసుకుంటున్న బీఎల్‌ఓ

చాదర్‌ఘాట్: ఎన్నికలు సమీపిస్తుండటంతో మలక్‌పేట నియోజకవర్గంలోని సర్కిల్–6లో ఓటరు జాబితా సమీకరణపై ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. తప్పులు లేని పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించాలని నిర్ణయించి ఆ మేరకు రెండు నెలలుగా సన్నాహాలు చేపట్టింది. ఇప్పటికే ఆధునిక సాంకేతిక సహాయంతో బోగస్ ఓట్ల ఏరివేత ప్రక్రియ కొనసాగుతుంది. ఆధార్ అనుసంధానం సైతం ముమ్మరంగా చేపడుతున్నారు. ఒకే ఇంటి నెంబర్‌లో పదుల సంఖ్యలో ఉన్న ఓట్లను గుర్తించే పనిలో బీఎల్‌ఓలు నిమగ్నమయ్యారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఒకటికి రెండుసార్లు ఓటర్లను పరిశీలించి జాబితాను వడపోసి అర్హులైన ఓటరు జాబితాను రూపొందించే పనలో నిమగ్నమయ్యారు. మరో వైపు ప్రత్యేక ఓటరు జాబిత సవరణ–2023 (ఎస్ఎస్ఆర్) పేరిట షెడ్యూల్ ప్రకటించారు. నూతన షెడ్యూల్ ఈ నెల 25న ప్రారంభం కాగా అక్టోబర్ 4న తుది ముసాయిదా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.

- మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో 300 పోలింగ్ బూత్‌లు ఉండగా 3,01,483 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,53,074, మహిళలు 1,48,396, ట్రాన్స్‌జెండర్లు 13 మంది ఉన్నారు.
- ఒకే ఇంట్లో ఆరుగురి కంటే ఎక్కువగా ఉన్న ఓటర్లను ఎన్నికల సంఘం ఇప్పటికే గుర్తించి ఆ జాబితాను నియోజకవర్గ ఎన్నికల అధికారులకు పంపించారు. ఎక్కువ ఓట్లు ఉన్న ఇళ్లను కూడా అధికారులు గుర్తించారు. బీఎల్‌ఓలు సదరు ఇళ్లకు వెళ్లి ఓటర్లు అర్హులేనా, వాస్తవంగా ఉన్నారా, వలస వెళ్లారా, చనిపోయారా, తప్పుగా నమోదు అయ్యారా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. తప్పులను సరిదిద్దుతూ ఒకేచోట ఓటుహక్కు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

జూన్ 23 వరకు సర్వే

- పారదర్శకత ఓటరు జాబితాను రూపొందించేందుకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి బోగస్ ఓట్లను తొలగిస్తూ కొత్త ఓటు హక్కు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మే 25 నుంచి జూన్ 23 వరకు దరఖాస్తులు పరిశీలన జరగనుంది. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1000 నుంచి 1500 మంది ఓటర్లు ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

అక్టోబర్ 4న తుదిజాబితా

- ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు కోసం జులై 25 నుంచి 31 వరకు పరిశీలన చేపడుతుంది. ఆగస్టు 2న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఆగస్టు 2 నుంచి 31లోపు అభ్యంతరాలు పరిశీలించి జాబితాను తుదిదశకు తీసుకువస్తారు. అక్టోబర్ 4న తుది జాబితాను ప్రకటిస్తారు.
- మలక్‌పేట నియోజకవర్గంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 డీసీ జయంత్ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. బీఎల్‌ఓలతో సమావేశాలు నిర్వహిస్తూ సమీక్షలు నిర్వహిస్తున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నా

- అన్ని ప్రాంతాల్లో మెరుగైన వసతులు కల్పిస్తా
- ఎల్‌బీనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని, అన్ని ప్రాంతాలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్–2లో కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... కాలనీలో మిగిలిపోయిన రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని, పార్కులో ఎండిపోయిన బోర్‌కు మరమ్మతులు చేయిస్తామని అన్నారు. అనంతరం కాలనీవాసులతో కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీలో వార్డు కార్యాలయం ఏర్పాటు విషయంలో గందరగోళం నెలకొన్న విషయం అందరికీ తెలిసిందేనని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నామని దేవిరెడ్డి అన్నారు. వార్డు కార్యాలయంలో 11 విభాగాలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రతి చిన్న సమస్య కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరగకుండా వార్డు కార్యాలయాలలోనే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. తాత్కాలికంగానే ఇంద్రప్రస్థకాలనీలో వార్డు కార్యాలయం ఏర్పాటు చేశామని కొన్ని నెలల తర్వాత అనువైన ప్రదేశంలోకి తరలించనున్నట్లు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హామీ యిచ్చారు. వార్డు కార్యాలయాన్ని మొదటి అంతస్తులో ఏర్పాటు చేశామని అధికారులు రావడానికి వెనుకవైపు నుంచి మరొకగేటు ఏర్పాటు చేస్తామని, కాలనీ వాసులు యోగా ఇతర కార్యక్రమాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. వార్డు కార్యాలయం ఏర్పాటు విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని... ఎల్లప్పుడు తాను కాలనీ వాసులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హామీ యిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, నాయకులు ముద్ద కళ్యాణ్, శ్రీనివాస్‌నాయక్, రఘుమారెడ్డి, నాగిరెడ్డి, చారి, రవీందర్, కాలనీ నేతలు దామోదర్‌రెడ్డి, మోహన్‌గౌడ్, అంజన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులకే కమ్యూనిటీ హాల్



కాలనీవాసులకు కమ్యూనిటీ హాల్ అప్పగిస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్: ఆరు సంవత్సరాలు తమ కమ్యూనిటీ హాల్‌ను పోలీస్ స్టేషన్‌గా ఉపయోగించేందుకు నగర పోలీస్ శాఖకు ఇచ్చి సహకరించిన ఎస్‌బీహెచ్–బీ కాలనీవాసులు అభినందనీయులని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌కు నూతన భవనం నిర్మిస్తున్నందున 2017లో సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్–బీ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను తాత్కాలికంగా సైదాబాద్ ఠాణాగా ఉపయోగించేందుకు కాలనీ సంక్షేమ సంఘం సమ్మతించి అప్పగించారు. ఇటీవలే నిర్మాణం పూర్తయిన సైదాబాద్ నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని రాష్ట్ర హోంమంత్రి, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు ప్రారంభించారు. అయితే అదే కమ్యూనిటీ హాల్‌ను సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌గా కొనసాగించాలని నగర సీపీ ప్రతిపాదించారు. అయితే కాలనీవాసుల వినతి మేరకు ఎమ్మెల్యే అధికారులతో చర్చించి భవనాన్ని తిరిగి కాలనీవాసులకు అప్పగించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే బలాల, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ సి.హెచ్.రూపేష్‌లు కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కాలనీవాసులకు భవనం తాళం చేతులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మనోహర్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

మునగలేదు ముంచారు!

బావిలో పడి గల్లంతైన వ్యక్తి మృత దేహం లభ్యం



మృతి చెందిన అబ్దుల్ రజాక్ (ఫైల్)

హయత్‌నగర్: వ్యవసాయ బావిలో బుధవారం పడి గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం మధ్యాహ్నం లభ్యమైంది. గల్లంతైన అబ్దుల్ రజాక్ ప్రమాదవశాత్తు మునిగి పోలేదని అతన్ని నీటిలోకి తోయడం వల్లనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం ప్రకారం... ఎస్ఆర్ నగర్‌కు చెందిన అబ్దుల్ రజాక్(30) తన స్నేహితుడు షాకీర్‌తో కలిసి బుధవారం ఉదయం కుంట్లూర్‌కు వెళ్లి అక్కడ పాన్‌షాపు విషయం మాట్లాడి తిరిగి హయత్‌నగర్‌కు వచ్చారు. అక్కడ హోటల్ వద్ద టీ తాగుతుండగా గతంలో పరిచయం ఉన్న హరున్ అతని ఇద్దరు స్నేహితులు కలిశారు. తాము స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్తున్నామని నీవు కూడా ఈత నేర్చుకుందువు మాతో రమ్మని రజాక్‌కు చెప్పారు. దీంతో తన వెంట వచ్చిన షాకీర్‌ను ఇంటికి పంపించిన రజాక్ హరున్ అతని ఇద్దరు స్నేహితుల వెంట వెళ్లాడు. అంతా కలిసి అన్మగల్ హయత్‌నగర్‌లోని సీతారాంరెడ్డి వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లారు. ఈత నేర్చుకునేందుకు బావిగోడపై కుర్చున్న రజాక్‌ను వెంట వెళ్లిన వారు నీటిలోకి తోసేశారని మరొకరు నీటిలోకి లాగేశారని రజాక్ సోదరుడు మన్నన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో రజాక్‌కు హరున్‌కు ఉన్న విభేదాల కారణంగా అదును చూసి రజాక్‌ను చంపారని ఆయన అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హడలెత్తిస్తున్న అగ్ని ప్రమాదాలు



కాలిపోతున్న పెయింట్స్ దుకాణం

నాగోలు: ఎల్‌బీనగర్‌లో ఓ కార్ గ్యారేజీలో భారీ అగ్ని ప్రమాదం సంఘటన మరువకముందే... మరో అగ్ని ప్రమాదం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఎల్‌బీనగర్ మసీదు గల్లీ ప్రధాన రహదారిపై కేఆర్ చౌదరి శ్రీగణేష్ ఎలక్ట్రికల్ హార్డ్‌వేర్ పెయింట్స్, శానిటరీ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ వైరు తెగి శ్రీ గణేష్ ఎలక్ట్రికల్ హార్డ్‌వేర్ పెయింట్స్‌పై పడింది. దీంతో మంటలు చెలరేగి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీ గణేష్ ఎలక్ట్రికల్ హార్డ్‌వేర్ దుకాణం పక్కనే ఉన్న షేక్ జమీర్‌కు చెందిన పాన్ డబ్బా కూడా పూర్తిగా కాలి బూడిద అయ్యింది. స్థానికులు ఎల్‌బీనగర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడి చేరుకుని రెండు గంటల పాటు శ్రమించి మంటలను అందుపులోకి తీసుకువచ్చారు. శ్రీ గణేష్ ఎలక్ట్రికల్ హార్డ్ వేర్ దుకాణంలో ఆస్తినష్టం పెద్ద జరగలేదు. బయట ఉన్న కొత్త సామగ్రి బోర్డులు కాలిపోయినట్లు అధికారులు తెలిపారు. షేక్ జమీర్‌కు చెందిన పాన్ డబ్బా పూర్తిగా దగ్ధం అయ్యిందని... సుమారు రూ. 30 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఎల్‌బీనగర్‌లో వరస అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

ప్లాట్ల డాక్యుమెంట్లు చోరీ చేసి తాకట్టు

నిందితులను అరెస్టు చేసిన వనస్థలిపురం పోలీసులు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

హస్తినాపురం: ఇంట్లో దాచిన ప్లాట్ల డాక్యుమెంట్లను చోరీ చేసి వాటిని తాకట్టుపెట్టిన నలుగురిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలేందర్‌రెడ్డి సమాచారం మేరకు... సచివాలయనగర్ కాలనీకి చెందిన రామకృష్ణారావు ఆస్ట్రేలియాలో స్థిరపడిన తన ముగ్గురు పిల్లల పేరుమీద మూడు ప్లాట్లు కొనుగోలు చేసి ఆ డాక్యుమెంట్లను ఇంట్లో దాచిపెట్టారు. 2015లో తన ఇంటి కింది పోర్షన్‌లో నాగ చక్రవర్తి అనే వ్యక్తిని ఉంచి వారి ఆస్తులు, ఇంటిని చూడమని చెప్పి రామకృష్ణారావు, తన భార్యతో కలిసి తన పిల్లల దగ్గరకు ఆస్ట్రేలియాకు వెళ్లిపోయారు. గత సంవత్సరం ఆగస్టులో తిరిగి వచ్చిన రామకృష్ణారావు తన ఇంట్లో ఉన్న ప్లాట్ల డాక్యుమెంట్లు కనిపించకపోవడంతో నాగచక్రవర్తిని నిలదీశారు. దీంతో గత ఆగస్టు 8న పోలీస్‌స్టేషన్‌లో నాగ చక్రవర్తిపై ఫిర్యాదు చేశారు. ఏప్రిల్‌లో సందీప్, రాజులు రామకృష్ణకు ఫోన్ చేసి అల్వాల్ ప్లాట్లకు సంబంధించి ఒరిజినల్ సేల్‌డీడ్ డాక్యుమెంట్లు తమ దగ్గరే ఉన్నాయని తనకు డబ్బులు ఇస్తే అవి ఇస్తానని బెదిరించాడు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బాలకృష్ణ అనే వ్యక్తి దగ్గర డాక్యుమెంట్లు ఉన్నాయని అతను రూ. 15 లక్షలకు కొన్నాడని, రూ. 20 లక్షలు ఇచ్చి తమని ఎంతకైనా అమ్ముకోమన్నాడని అందుకు రాజు, సందీప్‌లు ఆశపడి ప్లాటు చూడటానికి వచ్చి చుట్టు పక్కల వారితో ఆ ప్లాట్ తమదని చెప్పారన్నారు. బాలకృష్ణను అదుపులోకి తీసుకొని విచారించగా నాగచక్రవర్తి తనకు 2015లో రామకృష్ణారావు ఆస్ట్రేలియా వెళ్లగానే అతని ఇంట్లో డాక్యుమెంట్లు దొంగలించి నాకు రెండున్నర లక్షల రూపాయలకు అమ్మినట్లు ఒప్పుకున్నాడు. తర్వాత బాలకృష్ణ ఒక డాక్యుమెంట్‌ను హరీష్ అనే వ్యక్తికి 11 లక్షల రూపాయలు ఇవ్వవలిసి ఉండగా జమానత్ కోసం డాక్యుమెంట్‌ను తన అన్న రమేశ్ పేరున రిజిస్ట్రేషన్ చేసి మరలా హరిష్ పేరుపైన రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. నాగ చక్రవర్తి(40), బి.బాలకృష్ణ(44), ఎం.బీరప్ప అలియాస్ రాజు(44), సందీప్(24)లను అరెస్ట్ చేశారు. వారి నుంచి డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

- నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు
- సోనియాగాంధీ చిత్రపటానికి పాలభిషేకం చేయాలని పిలుపు

నాగోలు: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రతి డివిజన్ పరిధిలో జెండా ఎగురవేసి తెలంగాణ ఇచ్చిన తల్లి, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ చిత్రపటాలకు పాలాభిషేకం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తపేట్‌లో ఓ హోటల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ఏవైనా సరే ఎల్‌బీనగర్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అన్నారు. శుక్రవారం ప్రతి డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలతో బయలుదేరి ఎల్బీనగర్ నియోజకవర్గం అంతా కలియతిరిగాలి అని నిర్ణయించారు. అనంతరం ఎల్బీనగర్ చౌరస్తాలో సమావేశమై అమరవీరుల స్థూపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించాలని నిర్ణయించారు. అక్కడ నుంచి గాంధీభవన్‌కి తరలి వెళ్లాలని ఇందుకు కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, ప్రతి నాయకుడు కార్యకర్తలను సమన్వయపరిచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు కోరారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్‌గౌడ్, వివిధ డివిజన్ అధ్యక్షులు మంజులారెడ్డి, సత్యనారాయణ, మకుటం సదాశివుడు, కుంట్ల నర్సింహయాదవ్, దెంది శశిధర్ రెడ్డి, మల్లారపు శ్రీనివాస్, లింగాల కిషోర్ గౌడ్, బండ సురేందర్ రెడ్డి, బద్దుల వేణు యాదవ్, ఎస్సీ సెల్ నేత రాజ్ కుమార్, రాజశేఖర్, మైనారిటీ సెల్ మక్సూద్ అలీ, ఎస్టీ సెల్ రమేష్ నాయక్, సేవాదళ్ వెంకట్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సరూర్‌నగర్‌లో మంత్రి సబితారెడ్డి పర్యటన

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు మంత్రి సబితారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేస్తారని బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు బోయిని మహేందర్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వార్డుకమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రోడ్డు మూసివేతతో పరేషాన్

- వాహనదారులు, పాదచారులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



నాగోలు చౌరస్తాలో రోడ్డును మూసివేసిన దృశ్యం

నాగోలు: నిత్యం రద్దీగా ఉండే నాగోలు చౌరస్తాలో ఓ వ్యక్తి రోడ్డును పూర్తిగా మూసి వేసి నిర్మాణాలు చేస్తున్నాడు. నాగోలు చౌరస్తా నుంచి రోజూ వివిధ కాలనీలు, ఇతర ప్రాంతాలకు అక్కడ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వెళ్తుంటారు. అక్కడ నిర్మాణం చేపట్టిన ఓ వ్యక్తి రోడ్డు పూర్తిగా మూసి వేసి తమ కార్యక్రమాలను దర్జాగా చేసుకుంటున్నారు. దీంతో నాగోలు గ్రామంలోకి, ఇతర కాలనీలకు అక్కడ నుండి వెళ్లేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిని మూసి వేసి నిర్మాణాలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డును అక్రమించుకున్న వారిపై చర్యలు తథ్యం

నాగోలు చౌరస్తాలో రోడ్డు మూసివేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నా వారిపై చర్యలు తీసుకుంటమని జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారిణి సుష్మిత తెలిపారు. వెంటనే టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడి పంపించి మూసివేసిన రోడ్డును వెంటనే ఓపెన్ చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

తెలంగాణ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యులు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ దశాబ్ది వేడుకల నేపథ్యంలో ఇరాక్‌లోని బాగ్దాద్ షరీఫ్‌లో తెలంగాణ అభివృద్ధి, శాంతిని కాంక్షిస్తూ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు అబుల్ ఫతే బందగి బాద్‌షా రియాజ్ ఖాద్రీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇరాక్ పర్యటనలో భాగంగా బాగ్దాద్‌లోని పీరానేపీర్ గౌస్–ఇ–ఆజం దస్తగిర్ దర్గా షరీఫ్‌ను సందర్శించిన ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి జరగాలని, పేదల సంక్షేమం, జమునా.. గంగా తహజీబ్ కొనసాగించాలని ఆయన కాంక్షించారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌కు కేసీఆర్ నాయకత్వం ఎంతో అవసరమని, అప్పుడే దేశం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందన్నారు.

'గిరిజన బంధు'ను వెంటనే అమలు చేయాలి

పలు ప్రాంతాల్లో ఆందోళన చేసిన గిరిజన సంఘాలు



ఎరుకల నాంచారమ్మ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

మన్సూరాబాద్: సీఎం కేసీఆర్ ప్రకటించిన మేరకు గిరిజన బంధు పథకాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్ధ సత్యనారాయణ డిమాండ్ చేశారు. నాగోలు డివిజన్ ఎరుకల నాంచారమ్మ డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాల వద్ద గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... గిరిజనలను సీఎం కేసీఆర్ ఓట్ల కోసమే వాడుకుంటున్నారని, హామీ ఇచ్చిన అమలు చేయటం లేదన్నారు. నాయకులు ధర్మ నాయక్, బాలునాయక్, బాన్నపురం రఘు, కండెల వెంకటేష్, గోపీనాయక్, వనం గంగయ్య, చర్ల రమేష్, వనం శ్రీను, స్వామి పాల్గొన్నారు.

ఖాజాబాగ్‌లో...

సైదాబాద్: గిరిజన్ భవన్ ప్రారంభ సమయంలో దళిత బంధు ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ తన హామీని వెంటనే అమలు చేయాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐఎస్‌సదన్ డివిజన్ ఖాజాబాగ్ బస్తీలో పలు గిరిజన సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం కార్యదర్శి రఘు, తెలంగాణ గిరిజన సంఘం అధ్యక్షుడు ధర్మా నాయక్, సహాయ కార్యదర్శి బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో...

దిల్‌సుఖ్‌నగర్: గిరిజన బంధు అమలు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మానాయక్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.గోపీనాయక్ డిమాండ్ చేశారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్టీఆర్‌నగర్ బంజారా కాలనీలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సంఘం రాష్ట్ర నాయకులు బి.రఘు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపధ్యక్షుడు ఎం.బాలునాయక్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఆర్.రమావత్‌పాండు నాయక్, వి.జగన్‌నాయక్, సువలి బాయి, జానకి, బుజ్జి బాయి, తులసిరామ్, బి.గణేష్ నాయక్, జైపాల్ నాయక్, సక్రి బాయి, కమల్లీ, జగరం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఖాజాబాగ్‌లో...



ఎన్టీఆర్‌నగర్‌లో...